ప్రజాశక్తి
శుక్రవారం 18 ఆగస్టు 2023 8 పేజీలు
గుంటూరు పల్నాడు





ఎమ్మెల్యే x మేయర్

- గుంటూరు కౌన్సిల్‌లో గలభా
- రెండుగా చీలిన వైసిపి కార్పొరేటర్లు
- అభివృద్ధి పనుల్లో జాప్యంపై అధికారులపై ఆగ్రహం





ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం గురువారం వాడివేడిగా కొనసాగింది. సమావేశానికి మేయర్ కావటి మనోహర్ నాయుడు అధ్యక్షత వహించారు. అభివృద్ధి పనులు చేపట్టడంలో జాప్యంపై అధికారులపై పలువురు కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికి వచ్చిన ఎమ్మెల్యే ముస్తాఫా మేయర్ కావటిపై నిప్పులు చెరిగారు. ఒక దశలో ఏకవచన పద ప్రయోగం చేశారు. తన నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరగడంలేదని, లాభసాటి పనులే చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. గతంలో తాను కాంట్రాక్టు పనులు చేసే వాడినని, మీ వల్లే పనులు చేయడం మానేయడం వల్ల రూ.4 కోట్లు నష్టపోయానని దెప్పిపొడిచారు. మిమ్మల్ని మేయర్ సీట్లో కూర్చొబెడితే ఇష్టం వచ్చిన పనులు చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలకు మేం ఏం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఆగస్టు 15న మీరు జెండా వందనం చేస్తామంటే నేను, కార్పొరేటర్లు ముందే వచ్చాం.. మీరు వచ్చే వరకుపక్క గదిలో వేచి ఉన్నాం.. మీరు మమ్మల్ని పిలవకుండా జెండా ఎగుర వేసి వెళ్లిపోయారు... ఎమ్మెల్యేకు ఇచ్చే గౌరవం ఇదేనా? అని అన్నారు. మేయర్‌గా మీ బాధ్యతలు నిర్వహించడం లేదని, నియోజకవర్గంలో తనకు తెలియకుండానే కొన్ని పనులు చేస్తున్నారని విమర్శించారు. 14వ డివిజన్‌లో రూ.7.70 కోట్ల పనులకు మంజూరు చేసి రూ.60 లక్షల పనులు చేశారన్నారు. ఈ క్రమంలో మేయర్‌కు, ఎమ్మెల్యేకు వాగ్వావాదం జరిగింది. ఈ దశలో టిడిపి పక్ష ▶ 2లో

భూగర్భ డ్రెయినేజి పనులను పూర్తి చేయండి : ఎమ్మెల్సీ లక్ష్మణరావు

నార్ల ఆడిటోరియం పూర్తిపై మేయర్ దాటవేత



అసంపూర్తిగా ఉన్న భూగర్భ డ్రెయినేజి పనులను వెంటనే చేపట్టాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు కోరారు. ఈ పనులు చేపట్టడానికి పబ్లిక్ హెల్త్ అధికారులతో చర్చించాలన్నారు. దీనిపై ఎస్ఇ భాస్కరరావు మాట్లాడుతూ ఈ అంశం జిల్లా కలెక్టర్ పరిశీలిస్తున్నారని, సిఎంఒ అధికారులతో చర్చిస్తున్నారని తెలిపారు. నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియం పనులు పూర్తి చేయాలని లక్ష్మణరావు కోరారు. నార్ల వెంకటేశ్వరరావు పేరు ఉండటం ▶ 2లో



లోకేష్ పాదయాత్రకు ఘనస్వాగతం

ప్రజాశక్తి-తాడేపల్లి

టిడిపి జాయతీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తాడేపల్లిలో గురువారం నిర్వహించిన యువగళం పాదయాత్రకు ప్రజలు ఘన స్వాగతం పలకడంతోపాటు తమ వినతులనూ ఇచ్చారు. లోకేష్ అందర్నీ పలకరిస్తూ, వారి సమస్యలను వింటూ, ఫొటోలు దిగుతూ ముందుకు సాగారు. పాదయాత్ర ప్రారంభమైన వెంటనే వర్షం మొదలైనా లోకేష్ తన నడకను కొనసాగించారు. పట్టణంలోని డోలాస్‌నగర్, ప్రకాష్‌నగర్, నులకపేట, సాయిబాబా గుడి, ముగ్గురోడ్డు, వడ్డెరపాలెం, నెహ్రూ బొమ్మ సెంటర్, గణేష్ కళా మందిరం, బోసు బొమ్మ సెంటర్ మీదుగా ఉండవల్లి సెంటర్, ఉండవల్లిలో పాదయాత్ర సాగింది. ప్రకాష్‌నగర్‌లో దళితులు లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్ విదేశీ విద్య కొనసాగించాలని, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, సబ్‌ప్లాన్ నిధులను దళితుల సంక్షేమానికే ఉపయోగించాలని కోరారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, ఇళ్లస్థలాల సమస్యను పరిష్కరించాలని, బ్రహ్మానందపురంలో కారురాయిని అక్రమంగా తరలిస్తున్న వైసిపి నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కెసిపి సిమెంటు ఫ్యాక్టరీ సమస్య పరిష్కరించాలన్నారు. లోకేష్ స్పందిస్తూ తాము అధికారంలోకి వచ్చాక సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

పట్టణంలోని సలాం హోటల్ ▶ 2లో

బంగారం కోసం బ్యాంకు వద్ద ధర్నా

- దొడ్లేరు సిజిజిబి వద్ద రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన
- అధికారులు స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్
- రెండ్రోజుల్లో ప్రకటిస్తామన్న మేనేజర్



ప్రజాశక్తి - క్రోసూరు

బ్యాంకులో అవకతవకలపై బ్యాంకు అధికారులు స్పష్టమైన ప్రకటన చేసి రైతులకు భరోసానివ్వాలని రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. మండలంలోని దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో రైతులు తనఖా పెట్టిన బంగారం మాయమైన విషయం తెలిసిందే. దీనిపై బాధితులకు న్యాయం కోసం రైతు, కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో బ్యాంకు వద్ద గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా గోపాలరావు, కౌలురైతు సంఘం మండల కార్యదర్శి టి.హనుమంతరావు మాట్లాడుతూ రైతులు తమ బంగారాన్ని పరిశీలించుకోవడానికి వచ్చేనెల ఆఖరువరకూ తేదీలు ప్రకటించారని, అయితే ఇది చాలా దీర్ఘకాలమని అన్నారు. రైతులకు ధైర్యం కల్పించే ఒక్క చర్యనూ బ్యాంకు ఇప్పటి వరకూ తీసుకోలేదన్నారు. దీనివల్ల రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ఆందోళనకు స్పందించిన బ్యాంకు మేనేజర్ పి.శివశంకర్ మాట్లాడుతూ ఖాతాదారులు ఆందోళన చెందవద్దని, రెండ్రోజుల్లో ఉన్నతాధికారులను పిలిపించి స్పష్టమైన ప్రకటన చేస్తామని చెప్పారు. ధర్నాలో రైతు సంఘం నాయకులు ఎ.ఆంజనేయులు, సయ్యద్ హుస్సేన్, పి.పెద్దఆంజనేయులు, టి.మహేష్, పి.నాగరాజు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తాడేపల్లిలో పోరుయాత్ర బృందం, అంగన్వాడీలు

హామీలను విస్మరిస్తున్న ప్రభుత్వం


పలు మండలాల్లో రెండోరోజు కొనసాగిన అంగన్వాడీల పోరుయాత్ర

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా విలేకర్లు

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి అన్నారు. అంగనవాడీల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన పోరు యాత్ర గురువారం మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల్లో పర్యటించింది. ఆయా మండలాల్లో యాత్రకు అంగన్వాడీలు ఘన స్వాగతం పలకడంతోపాటు తమ సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కంటే ఎక్కువగా జీతాలు ఇస్తానని జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా హామీ ఇచ్చారని, ఇప్పుడు పూర్తిగా విస్మరించారని విమర్శించారు. అంగన్వాడీలకు పని భారం తగ్గించాలని, హెల్పర్ల ప్రమోషన్ లో రాజకీయం జోక్యాన్ని నివారించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల పిల్లలకు అమ్మఒడి, యూనిఫామ్ ఇవ్వాలని, ప్రీ స్కూల్‌ను బలోపేతం చేయాలని అన్నారు. అన్ని సెంటర్లను వంట పాత్రలు, ఫర్నిచర్, విద్యుత్, గ్యాస్, తాగునీటి సమస్యలు పరిష్కరించాలన్నారు.

అంగన్వాడీలకూ సంక్షేమ పథకాల అమలు చేయాలని డిమాండ్ ▶ 2లో

కుండపోతగా వాన



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. గుంటూరులో సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటలవరకు కుండపోతగా భారీ వర్షం కురిసింది. వర్షానికి గుంటూరు కార్పొరేషన్ కార్యాలయంలోకి భారీ వర్షం నీరు చేరింది. డొంకరోడ్డు, అమరావతి రోడ్డు, లక్ష్మీపురం, పట్టాభిపురం, పాత గుంటూరు, నందివెలుగురోడ్డు, పలకలూరు రోడ్డు, పొన్నూరు రోడ్డులో వర్షం నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల, పెదకూరపాడు, సత్తెనపల్లి, అమరావతి, గుంటూరు జిల్లా తాడికొండ, మంగళగిరి, తాడేపల్లి, పెదకాకాని, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఈనెలలో చాలినంత వర్షాలులేక సేద్యానికి ఇబ్బంది పడుతున్న రైతులకు ఈ వర్షం కొంతమేలు చేకూరుస్తుందని భావిస్తున్నారు. కొన్ని రోజులుగా వర్షాలు లేక ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు చల్లటి గాలులతో ▶ 2లో

ఆహారం వికటించి అక్కాతమ్ముడు మృతి మెయిన్‌లో

శ్రీచైతన్య కళాశాల విద్యార్థిని అదృశ్యం 3లో

డివైడర్‌ను ఢీ కొట్టిన లారీ

ప్రజాశక్తి-తెనాలి



డివైడర్‌ను లారీ ఢీకొనడంతో ట్రాఫిక్ కు దాదాపు గంటసేపు అంతరాయం కలిగింది. స్థానిక చెంచుపేట ఫ్లైఓవర్ పై గుంటూరు వైపు నుంచి తెనాలి వస్తున్న లారీ గురువారం మధ్యాహ్నం సెంటర్ డివైడర్ గా పెట్టిన రాళ్లను ఢీకొంది. దీంతో, లారీ యాక్సిస్ కింద బండరాళ్లు ఇరుక్కుపోవడంతో లారీ నిలిచిపోయింది. ఫలితంగా ఫ్లై ఓవర్ పై ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. దాదాపు గంటసేపు శ్రమించిన అనంతరం జెసిబి సాయంతో లారీని తొలగించారు. పట్టణ త్రీ టౌన్ పోలీసులు ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు

హామీలను విస్మరిస్తున్న ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. బాలింతలు, గర్భిణులకు సేవ చేస్తున్న ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నాయని మండిపడ్డారు. నూతన విద్యా విధానం విద్యా రంగాన్ని బలహీనపరుస్తుందని, అయితే దీని అమలుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గమని అన్నారు. 12 గంటల పాటు బానిసలుగా పని చేస్తున్న అంగన్‌వాడీలకు సరైన వేతనాలు ఇవ్వడంలేదని, అంగన్‌వాడీలు అప్పులపాలవుతూ సెంటర్లు నడుపుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపిలకు అందిస్తున్న సౌకర్యాల్లో పది శాతాన్ని అంగన్‌వాడీలకు వర్తింపజేసినా వారి జీవితాలు బాగుపడతాయన్నారు. గతంలో పసుపు, కుంకుమ ప్రస్తుతం నవరత్నాలు పేరుతో అంగన్‌వాడీల నిధులు పక్కదారి పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాడిటీ ఇవ్వాలని కోరారు. పనిచేయని ఫోన్లు ఇచ్చి మానసికంగా వేధిస్తున్నారని మండిపడ్డారు. లబ్ధిదారులకు ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు అందజేయాలని కోరారు. అంగన్వాడీల పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ సమస్యలపై అంగన్వాడీలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో నాయకులు వి.దుర్గారావు, సబిత, టి.రాధ, కె.శ్యామల, కిరణ్మయి, ఎబిఎన్ కుమారి, ఎస్ఎస్ చంగయ్య, వై.కమలాకర్, హేమలత, జయలక్ష్మి, కళ్యాణి, అన్నపూర్ణ, జె.బాలరాజు, వై.బ్రహ్మేశ్వరరావు, జయశ్రీ, పావని, నిర్మల జ్యోతి, ఎం.శివసాంబిరెడ్డి, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.



కుండపోతగా వాన

(మొదటి పేజీ తరువాయి)

కొంత వరకు తెప్పరిల్లారు. చల్లటి గాలితో ఆహ్లాదకరమైన వాతావరణ ఏర్పడింది. పెదకూరపాడులో వాన పైర్లకు జీవం పోస్తుందని రైతులంటున్నారు. అయితే గాలుల కారణంగా మొక్కలు వంగుతాయని ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు పెదకూరపాడులోని వాగులు పొంగి రోడ్ల పైనుండి నీరు ప్రవహించింది. పలుచోట్ల బ్రిడ్జిలకు కంప, ఇతర వ్యర్థాలు అడ్డుపడ్డాయి. నీటి ప్రవాహంతో పొలాలు, మట్టి రోడ్లు కోతకు గురవుతాయని స్థానికులంటున్నారు.



లోకేష్ పాదయాత్రకు ఘనస్వాగతం

(మొదటి పేజీ తరువాయి)

సెంటర్‌లో 60 ఏళ్లుగా రైల్వే స్థలాల్లో నివాసం ఉంటున్న తమకు పట్టాలిచ్చే విధంగా న్యాయం చేయాలని స్థానికులు కోరారు. రెగ్యులర్ చేస్తామని హామీనిచ్చిన వైసిపి నాయకులు విస్మరించారని తెలిపారు. పట్టణంలో సుమారు 900 కుటుంబాలు రైల్వే స్థలాల్లో నివశిస్తున్నారని, వారందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేయాలని, కృష్ణానది పక్కనే ఉన్న ఇసుక ధరలు మండిపోతున్నాయని, నిర్మాణ రంగంపై ఆ ప్రభావం పడిందని తెలిపారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ అధికారంలోకి రాగానే ఇసుకను అందుబాటులోకి తెస్తామని, ఇళ్లస్థలాలు రెగ్యులైజ్ చేసి పట్టాలిస్తామని హామీనిచ్చారు. నెహ్రూ బొమ్మ సెంటర్‌లో రైతులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఉన్నది రైతు ప్రభుత్వం కాదని, తమ కష్టాలు పెరిగాయని, పంటలకు మద్దతు ధర లేదని, పసుపు పంట కల్లాల్లోనే తడిసి సరైన ధర రావడంలేదని, సిఎం ఇంటి సమీపంలో డబుల్ లైన్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. దారి పొడవునా పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. రెండు మూడు సెంటర్లలో లోకేష్‌క గజమాలలతో స్వాగతం పలికారు.

రాష్ట్రంలో చేతగాని పాలన : లోకేష్

వివిధ సెంటర్లలో మాట్లాడుతూ జగన్ చేతకాని పాలన వల్ల రైతులు నష్టపోతున్నారని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే రైతు సంక్షేమ పథకాలు పునరుద్ధరిస్తామన్నారు. తాడేపల్లిలో డబుల్ లైన్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిఒక్కరికీ పక్కా ఇల్లు మంజూరు చేస్తామని హామీనిచ్చారు. సిమెంటు ఫ్యాక్టరీ బాధితుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమంగా క్వారీయింగ్ చేసే వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థిక తోడ్పాటు అందిస్తామన్నారు. 45 ఏళ్లు నిండిన వారికి రూ.5 వేలు పింఛను మంజూరు చేస్తామన్నారు. వేట నిషేధ సమయంలో రూ.10 వేలు జీవనభృతి కల్పిస్తామని హామీనిచ్చారు. ఇంటి పట్టాల పేరుతో ఏడు వేల కోట్లు దోచుకున్నారని వైసిపిపై ఆరోపణలు సంధించారు. రన్నింగ్ రూమ్‌ల్ సెంటర్‌లో అధికంగా వస్తున్న కరెంటు బిల్లులపై ప్రజలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ అనురాధ, మాజీ ఎమ్మెల్యేలు యరపతినేని



శ్రీనివాసరావు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, నాయకులు పోతినేని శ్రీనివాసరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు వి.వెంకట్రావు, జె.సాంబశివరావు, తెలుగు రైతు గుంటూరు పార్లమెంట్ అధ్యక్షులు కె.రాజశేఖరరెడ్డి, సిహెచ్.సుబ్బారావు, రూరల్ కార్యదర్శి ఎ.సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి నుండి టిడిపిలోకి కొనసాగుతున్న చేరికలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

వైసిపి నుండి కీలక నాయకులు టిడిపిలో చేరుతున్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా గురువారం డాన్ బాస్కో స్కూల్ వద్ద విడిది కేంద్రంలో పలువురు వైసిపికి చెందినవారు లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరారు. వీరిలో నిడమర్రుకు చెందిన పాములపాటి వీరశివారెడ్డి, తాడేపల్లికి చెందిన సూరెడ్డి వెంకటరెడ్డి, కె.నాగేశ్వరావు, నవులూరుకు చెందిన ఏపూరి సురేష్ నాయుడు, పంచల సువార్త, వేమూరు ప్రణయ్, యర్రబాలేనికి చెందిన దూళ్ల శేషు గోపయ్య, వీరితో పాటు మంగళగిరి పట్టణానికి చెందిన 13వార్డు, తాడేపల్లిలోని 2, 5, 7, 23వ వార్డులు, నవులూరు, కృష్ణాయ పాలెం, యర్రబాలెంకు చెందిన సుమారు 300పైగా కుటుంబాల వారు చేరినట్లు టిడిపి నాయకులు తెలిపారు.



ఎమ్మెల్యే x మేయర్

(మొదటి పేజీ తరువాయి)

నాయకుడు కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ ప్రజా సమస్యలపై చర్చించకుండా వ్యక్తిగత అంశాలు మాట్లాడుకుంటున్నారని అన్నారు.

తాను ఎవరి డివిజన్‌లో పనులు ఆపలేదని, ఏ కాంట్రాక్టరును టెండరు వేయకుండా చేయలేదని మేయర్ అన్నారు. 14వ వార్డుపై ఎందుకు వివక్ష అని ఎమ్మెల్యే ప్రశ్నించగా కాంట్రాక్టరుకు యాక్సిడెంట్ అవ్వడం వల్ల పనులు ప్రారంభం కాలేదని ఎస్ఇ భాస్కరరావు సమాధానమిచ్చారు. గతంలో కూడా తాను ఇదే విధంగా గట్టిగా మాట్లాటడం వల్ల కొన్ని పనులు జరిగాయని, ఇంకా జరగాల్సి ఉందని ముస్తాఫా అన్నారు. నాతో పనులు చేయనివ్వకుండా అంతుచూస్తామన్నారు.. చూశారు. మీ లాగా నాకూ తెలుసూ... తాళం వేయడం తెలుసు. తీయడం తెలుసు అన్నారు. ఆటోనగర్‌లో రూ.10 కోట్లతో చేపట్టిన పనులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ క్రమంలో వైసిపి కార్పొరేటర్లు రెండుగా చీలిపోయి కొంత మంది ఎమ్మెల్యేకు అనుకూలంగా, మరికొంత మంది మేయర్‌కు అనుకూలంగా మాట్లాడారు. తమ వార్డులో పనులు జరగడంలేదని ముస్తాఫా గ్రూపునకు చెందిన ముగ్గురు మహిళా కార్పొరేటర్లు విమర్శలు చేశారు. తన వార్డులో పనులు జరగడం లేదని డిప్యూటీ మేయర్ సజీల తన వాదన విన్పించారు. దీంతో కార్పొరేటర్ల మధ్య పలు మార్లు వాగ్వావాదం చోటుచేసుకుంది. ఒక దశలో తీవ్ర గందరగోళం మధ్య సమావేశానికి వాయిదా వేయాలని మేయర్ భావించారు. తరువాత ప్రతిపాదన విరమించుకుని కొనసాగించారు. ఈ దశలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ సభను మేయర్ ఆర్డర్‌లో పెట్టాలన్నారు. ఎవరికి వారు మాట్లాడుకుని వాగ్వావాదం చేసుకుంటే చూస్తూ ఊరుకోవడం సరికాదన్నారు.

సమావేశం ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగింది. అంతకు ముందు ఎన్‌టిఆర్ స్టేడియంలో కార్పొరేటర్ల కుటుంబాలకు శాశ్వత సభ్యత్వం కల్పించడంపై చర్చించారు. కార్పొరేటర్లుకు ఉచితంగా సభ్యత్వం ఇవ్వాలని పలువురు కోరారు. ఇందుకు నిబంధనలు మారుస్తూ తీర్మానం చేయాలన్నారు. 1995లో ఒక్కొక్కరు రూ.5 వేలు చెల్లించారని మేయర్ కావటి మనోహర్‌నాయుడు తెలిపారు. పలు తర్జన భర్జనల అనంతరం 10 మంది కార్పొరేటర్లు, అధికారులతో కమిటీ వేస్తున్నట్టు తెలిపారు. ఇన్నర్ రింగ్‌రోడ్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేయాలని డిప్యూటీ వనమ బాలవజ్రబాబు కోరారు. ఈ అంశంపైగతంలోనే ఎంపి గల్లా జయదేవ్ కేంద్రానికి లేఖ రాశారని, ఇది కేంద్రం పరిశీలనలో ఉందని టిడిపి కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ పేర్కొన్నారు. దీనిపై టిడిపి, వైసిపి కార్పొరేటర్ల మధ్య వాగ్వావాదం జరిగింది. ఎంపి కనిపించడం లేదని వైసిపి కార్పొరేటర్లు అనగా సిఎం కన్పించడం లేదని టిడిపి కార్పొరేటర్లు అన్నారు. హోర్డింగ్‌లపై చర్చ సందర్భంగా కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డిపై సిటీప్లానర్ అనుచితంగా మాట్లాడి తరువాత క్షమాపణ చెప్పారు.

భూగర్భ డ్రెయినేజి పనులను పూర్తి చేయండి : ఎమ్మెల్సీ లక్ష్మణరావు

(మొదటి పేజీ తరువాయి)

వల్లే పనులు చేయడం లేదా అని ప్రశ్నించారు. నార్ల ఒక ప్రసిద్ధ జర్నలిస్టు, వివిధ పత్రికలకు ఎడిటర్‌గా చేశారని అన్నారు. ఈ పనులు పూర్తికి రూ.10 కోట్లు కావాలని అధికారులు తెలిపారు. అయితే ఈ ఆడిటోరియం పనులు చాలావరకు పూర్తి అయినందున పిపిపి పద్ధతిలో ఎవరికైనా లీజుకు ఇవ్వాలని ఎమ్మెల్యే మద్దాలి గిరి సూచించారు. పేరు మార్చి అయినా ఆడిటోరియం పనులు చేపట్టాలని మీ పేరైనా పెట్టుకోవాలని టిడిపి కార్పొరేటర్ మానం పద్మశ్రీ కోరారు. ఈ ఆడిటోరియం ఇప్పుడు కాదులే... తరువాత ఆలోచిద్దాం అని మేయర్ దాటవేశారు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యలపై ఎమ్మెల్సీ లక్ష్మణరావు ప్రశ్నించారు. 2153 మంది కార్మికులు పని చేస్తున్నారని, వారికి పిఎఫ్, ఇఎస్ఐ చెల్లిస్తున్నామని తెలిపారు. మొత్తం 340 మంది శాశ్వత కార్మికులు, 1813 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులని అధికారులు తెలిపారు. వీరికి కొబ్బరి నూనె, సబ్బులు, ఇతర వస్తువులు త్వరలో ఇస్తామన్నారు.

కాల్వలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి-తెనాలి

రూరల్ గ్రామం పెదరావూరు సమీపంలోని కాలువలో గుర్తుతెలియని మతదేహం లభ్యమైంది. రూరల్ పోలీసులు గురువారం వెల్లడించిన వివరాల ప్రకారం సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగిన పురుష మతదేహం నీటి ప్రవాహంలో కొట్టుకొచ్చింది. మతుడు చొక్కా, ఫాంటు, బెల్టు ధరించి, జేబులో లాఫింగ్ బుద్ధ బొమ్మ కలిగి ఉన్నాడని, అతనకి గడ్డం ఉందని, సుమారు 5.6 అడుగుల ఎత్తు కలిగి ఉన్నాడన్నారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. వ్యక్తి ఆనవాళ్లు గుర్తించిన వారు రూరల్ పోలీస్ స్టేషన్లో సంప్రదించవలసిందిగా కోరారు.



కాలువలో లభ్యమైన మృతదేహం

మైనర్ బాలిక అదృశ్యం

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో మైనర్ బాలిక అదృశ్యంపై త్రీ టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం స్థానిక ఆర్ఆర్ నగర్కు చెందిన బాలిక డిప్లమో చదివి ఇంటి వద్ద ఉంటోంది. ఇంటి నుంచి బయటికి వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీచైతన్య కళాశాల విద్యార్థిని అదృశ్యం

- కళాశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన
- నరసరావుపేటలో ఘటన - దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- బయట నుండి వెళ్లిపోయినట్లు సిసి ఫుటేజీలో గుర్తింపు



అదృశ్యమైన విద్యార్థిని వైష్ణవి (ఫైల్)



కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థిని తల్లిదండ్రులు, వారి బంధువులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

కళాశాల బస్సులో వచ్చిన విద్యార్థిని కాలేజీ లోనికి రాకుండా బస్సు దిగి బయ టకు వెళ్లిన ఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. విద్యార్థిని అదృశ్యం అయిన విషయాన్ని బుధవారం సాయం త్రం కళాశాల సిబ్బంది గుర్తించి, తల్లిదండ్రు లకు సమాచారం ఇచ్చారు. బంధువులను తెలిసిన వారిని విచారించిన అనంతరం గురువారం విద్యా ర్థిని తల్లిదండ్రులు, బంధువులు, ఆమె అదృశ్యం కళాశాల సిబ్బంది నిర్లక్ష్యం వలనే జరిగిందంటూ ఆందోళన చేపట్టారు. కుటుంబసభ్యులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఫిరంగిపురం మండలం నుదురుపాడుకి చెందిన ఒంటిపులి శ్రీను, నాగలక్ష్మి దంప తుల కుమార్తె వైష్ణవి. నరసరావుపేట పట్టణంలోని రామిరెడ్డిపేటలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ప్రతిరోజు గ్రామం నుండి కళాశాలకు కళాశాల బస్సులోనే వస్తుందని చెప్పారు. ఈ క్రమంలో బుధ వారం ఉదయం యథావిధిగా కళాశాలకు బయలుదేరిన వైష్ణవి కళాశాల లోపలకి రాకుండా బయటకు వెళ్లిపోయింది. విద్యార్థులకు హాజరు వేసే క్రమంలో వైష్ణవికి బదులుగా తోటి విద్యార్థిని ప్రజెంట్ అని చెప్పడంతో గమనించని అధ్యాపకులు విద్యార్థిని అదృశ్యమైన విషయాన్ని గ్రహించలేక పోయారన్నారు. సాయం త్రం కళాశాల బస్సు గ్రామానికి వచ్చిన ప్పటికీ తమ బిడ్డ ఇంటికి రాకపోవడంతో ఆమె తల్లిదండ్రులు మొదట కళాశాల సిబ్బందిని ప్రశ్నించారు. వారు సరైన సమాధానం చెప్పకపోవడంతో 1వ పట్టణ పోలీసులను ఆశ్రయించారు. గురువారం విద్యార్థిని తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు కళాశాల ఎదుట ఆం దోళన చేపట్టారు. శు క్రవారం సాయంత్రం లోగా విద్యార్థిని ఆచూకీ కనిపెడతామని కళాశాల సిబ్బంది పోలీసులు ఇచ్చిన హామీ మేరకు తల్లిదండ్రులు ఆందోళన విర మించారు. కాగా శ్రీను,నాగలక్ష్మి దంప తులకు ఇద్దరు సంతానం. కుమార్తెను ఉన్నత చదువులు చదివించాలని కూలి నాలి చేసుకుంటూ చదివించుకుంటున్నా మని కళాశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తమ కుమార్తె అదృశ్యమైందని ఆరోపిం చారు.రంగంలోకి దిగిన 1వ పట్టణ పోలీ సులు సిసి పుటేజిని పరిశీలించగా విద్యా ర్థిని బస్సు దిగి కళాశాల లోనికి రాకుండా బయటకు వెళ్ళడాన్ని గుర్తించారు. ఆ మార్గంలో పలు దుకాణాలు కార్యాలయాల్లో ఉన్న సిసి కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు 1వ పట్టణ సిఐ అశోక్ కుమార్, ఎస్.ఐ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా ఎస్పీ రవి శంకర్ రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థిని ఆచూకీ కోసం గాలింపు చేపట్టామన్నారు. తల్లిదండ్రులకు సంబంధించిన ఫోన్ ద్వారా విద్యార్థిని వైష్ణవి తరచు ఫోన్ మాట్లాడుతుండేదని సిసి పుటేజ్, ఫోన్ యొక్క సంక్షిప్త సమాచారం మేరకు దర్యా ప్తు ముమ్మరం చేస్తామన్నారు. ఇప్పటికే విద్యార్థినితో సన్నిహితంగా మెలిగే పలు వురు విద్యార్థులను పోలీస్ స్టషన్‌కు విచారిస్తున్నామన్నారు. కళాశాల తరపున కూడా గాలింపు చేపట్టామని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు అన్నారు. కళా శాలలో విద్యార్థిని వైష్ణవి కి బదులుగా హాజరు పలికిన విద్యార్థినిని కూడా విచా రిస్తున్నట్లు చెప్పారు. ఆమెతో సన్నిహితంగా ఉండేవారిని విచారణ జరిపి వివరాలను పోలీసులకు వివరించినట్లు చెప్పారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 41,597
మిర్చి ఎగుమతి	: 40,242
మిర్చి నిల్వ	: 11,725

మిర్చి ధరలు

రూపాయలలో

334	9,200 - 24,000
నెం.5	11,500 - 20,000
273	19,000 - 20,500
341	13,000 - 23,000
సూపర్10	11,000 - 12,500
నాన్ ఎసి	
తేజ	10,000 - 24,200
బడిగి	10,500 - 25,500
దేవనూరు డీలక్స్	15,000 - 23,500
తాలుకాయలు	5,000 -14,500
ఎసి	
334	9,500 - 24,500
నెం.5	18,500 - 23,000
273	19,500 - 20,000
341	16,000 - 23,000
4884	18,500 - 21,000
తేజ	12,000 - 24,200
బడిగి	14,500 - 26,000
దేవనూరు డీలక్స్	17,800 - 22,000
తాలుకాయలు	9,500 -13,000

ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పెదకూరపాడు

పెదకూరపాడు గ్రామానికి చెందిన అలా అప్పా రావు కుటుంబానికి రూ.5000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని గురువారం టిడిపి నాయకులు అందిం చారు. అలా అప్పారావు ఆరోగ్యంతో మరణించారు. పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ పార్టీ నాయకుల ద్వారా సహాయం అందజేశారు.

టాక్టర్ ఢీ కొని యువకుడు మృతి

ప్రజాశక్తి-అచ్చంపేట

ట్రాక్టర్ ఢీకొని తాళ్ళచెరువు గ్రామానికి చెందిన బత్తుల శ్రీను(40) మతి చెందిన సంఘటన అచ్చంపేట తాళ్ళచెరువు అడ్డ రోడ్డు దగ్గర పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం జరి గింది. బత్తుల శ్రీను అచ్చం పేట లోని తన సోదరి మల్లెల రమణ ఇంటికి వెళ్లి ఆమెను తీసుకొని తాళ్ళచెరువు కి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఈ ప్రమా దం జరిగింది. బంకులో నుంచి వస్తున్న వాహనాన్ని తప్పించబోతూ మాదిపాడు వైపు నుండి అచ్చంపేట వైపు వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టాడు. ఇరువురు గాయాలపాలు కావడంతో 108 లో సత్తెనపల్లి తరలించారు. రమణకు స్వల్ప గాయాలు కాగా శ్రీను మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

24న 'చలో విజయవాడ'కు తరలిరావాలని పిలుపు

- మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి
- పలుచోట్ల కార్మికుల నిరసన, అధికారులకు వినతులు


పిడుగురాళ్లలో..

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక బంగ్లా సెంటర్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో గురువారం మానవహారాన్ని మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయకుండా ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు పాదయాత్ర చేస్తూ ఇలాంటి మురికి పనులను లక్ష రూపాయలు జీతం ఇచ్చినా ఎవరూ చేయరని, తాను అధికారంలోకి వస్తే వీళ్లందరినీ పర్మినెంట్ చేస్తానని నాడు హామీయిచ్చి, సీఎం అయిన తర్వాత మాట తప్పారని విమర్శించారు. అదే విధంగా ఆప్కాస్ సంస్థను తీసుకొచ్చి దానిలో చేర్చడం వలన ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ ఒక్కటీ కూడా అమలు కావట్లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు లేకపోవడం వలన కార్మికుల ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఆప్కాస్ సంస్థను రద్దు చేయాలని, సిపిఎస్ ను రద్దు చేయాలని కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని తదితరు డిమాండ్ల సాధన కోసం ఈనెల 21వ తేదీన బైక్ ర్యాలీ, 24న చలో విజయవాడ కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు బత్తుల రామారావు ,అంగడి శ్రీను, బత్తుల అనిల్ ,కోటేశ్వరరావు, మార్తమ్మ, కుంభ క్రిష్ణవేణి ,అనంతలక్ష్మి, కంప శివ ,తమ్మిశెట్టి పద్మ, కొదమల మరియమ్మ, అరుణకుమారి పాల్గొన్నారు.


సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ కె.షమ్మికి వినతిపత్రం అందజేస్తున్న చిత్రం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మున్సిపల్ కార్మికులను పర్మిట్ చేయాలని, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు నాయకులు జడ రాజ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 24న విజయవాడకు మున్సిపల్ కార్మికులంతా తరలిరావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ మేరకు స్థానిక గార్లపాడు బస్టాండ్ సెంటర్లో మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు.

రాజ్ కుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ మున్సిపల్ కార్మికులపై చిన్నచూపు తగదని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ కె.షమ్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సి పల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూని యన్ అధ్యక్షులు చింతకుంట్ల పెద్ద వెం కయ్య, పల్నాడు జిల్లా అధ్యక్షులు చంద్రకళ, కార్మికులు జి కమలమ్మ,మేడి సత్యవతి ,చిలక సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-దాచేపల్లి

మండలంలోని దాచేపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో దాచేపల్లి మున్సిపల్ కమిషనర్ కు సత్యనారాయణకు మున్సిపల్ కార్మికులు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు పాల్గొన్నారు.


దాచేపల్లి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు

కొండ్రముట్ల జంక్షన్‌లో సిసి కెమెరాలు

ప్రజాశక్తి-ఈపూరు


సిసి కెమెరాల ఏర్పాటును పర్యవేక్షిస్తున్న ఎస్ఐ ఫిరోజ్

శాంతి,భద్రతలకు విఘాతం కలిగించే ప్రాంతాలలో సీసీ కెమెరాలు నిఘాను పెంచుతున్నట్లు ఎస్సై షేక్ మహమ్మద్ ఫిరోజ్ తెలిపారు. మండలంలోని కొండ్రముట్ల,బొల్లాపల్లి జంక్షన్ వద్ద నిరంతర నిఘా కోసం మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలో కొందరు ఆకతాయిలు కొంతకాలంగా కారంపూడి ,బొల్లాపల్లి ప్రధాన రహదారి వైపు నిమ్మకాయ లు విసురుతూ పందేలు నిర్వహించటంతో వాహనదారులు, ప్రజలు నానా అవస్థలు పడ్డారు.సిసి కెమెరాలు ఏర్పాటు తో ఆ ప్రాంతంలో పందే ల నిర్వహణకు చెక్ పడటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ తెలిపారు.



అమరావతిలో రైతులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అమరావతి

ప్రత్తి పంటలో వచ్చే గులాబి రంగు పురుగు విషయంలో రైతులందరూ జాగ్ర త్తగా ఉండాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ రామాంజనేయులు అన్నారు. గురువారం మండల కేంద్రమైన అమరావతిలోని పంచాయతీ కార్యా లయంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ రామాంజనేయులు మాట్లాడుతూ రైతులకు ప్రత్తి పంటలలోని యాజమాన్య పద్ధతుల గురించి తెలియచేశారు. రైతులకు, లంక భూములు గల రైతులకు ఎస్సీ కార్పొరేషన్, ఆర్టికల్చర్ ద్వారా రైతు పథకాలు ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం వైసీపీ సీనియర్ నాయకులు నిమ్మా విజయసాగర్ బాబు. డాట్ సెంటర్ సైంటిస్ట్ రమేష్, డిడిఎ శివకుమారి, అమరావతి రీసెర్చ్ స్టేషన్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ లక్ష్మీపతి, క్రోసూరు ఎడిఎ హనుమంతరావు మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అహ్మద్ , విఏఏ లు పవన్ కుమార్, శ్రీలక్ష్మి, ఆశాబి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల రెన్యువల్‌కు దరఖాస్తులు

ప్రజాశక్తి - వినుకొండ



పల్నాడు జిల్లా పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో కాం ట్రాక్టు విధానంలో పని చేస్తున్న అధ్యాపకులను 2023-24 విద్యా సంవత్సరానికి రెన్యువల్ చేసేందుకు ధరఖాస్తులు కోరుతున్నట్లు స్థానిక ఐడెంటిఫైడ్ (ఐడి) కాలేజీ ఎస్. జి. కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరంలో మే 31 వరకు పనిచేసిన కాంట్రాక్ట్ అధ్యాపకులు రెన్యువల్ కు అర్హులు అని తెలిపారు. ఈనెల 19 సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ గారి అధ్యక్షతన జరుగుతున్న రెన్యువల్ కమిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను రెన్యువల్ చేస్తుందని తెలియజేశారు.

యానిమేటర్లకు జీతాలివ్వకపోవడం అన్యాయం

ప్రజాశక్తి-చిలకలూరిపేట


మాట్లాడుతున్న పేరుబోయిన వెంకటేశ్వర్లు

యానిమేటర్లకు దాదాపు 6,7 నెల ల నుంచి ఇస్తున్న కొద్దిపాటి జీతాలు కూడా ఇవ్వక పోవడం అన్యాయమని సిఐటియు మండల కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పండరీపురం లోని ఏలూ రు సిద్దయ్య విజ్ఞాన భవన్‌లో గురువారం జరిగిన మండల స్థాయి విఒఎల సమస్యలపై జరిగిన సమా వేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అనేక సంఘాల(ఆశ, మధ్యాహ్నం, ఇతర సంఘాలు) వారికి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చక పోతే పోరాటాల ద్వారా సాధించు కున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లుగా మార్చటాన్ని సమంజసం కాదని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.యానిమేటర్లకు చెల్లించాల్సిన బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి చట్టబద్ధత తీసుకురావాలని, మూడేళ్ల కాలంలోనే పని చేయాలన్న నిబంధనను వెంటనే రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరల దృష్ట్యా ప్రస్తుతం వారికి ఇస్తున్న రూ.8 వేలు చాలవని, అందువల్లే ఈ యానిమేటర్లు అప్పుల పాలవుతున్నారని అన్నారు. వీరికి కనీసం రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, వారికి ఇచ్చే జీతాలు గ్రామ సంఘాల ఖాతాల్లో వేయకుండా నేరుగా విఒఎల ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన సచివాలయాల ఉద్యోగులను పర్మి నెంట్ చేసినప్పుడు సంవత్సరాల తరబడి పనిచేస్తున్న వీరిని ఎందుకు పర్మినెంట్ చేయరని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. విఒఎలను నూతన యాపులతో పనులు చేయమనడం సబబు కాదని, అందుకు తగిన సౌకర్యాలను (కొత్త ఫోన్లను) వెంటనే ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. అనుభవం కలిగిన విఒఎలను సీసీలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో అధ్యక్షురాలుగా నెలం ఏసుమ్మ, కార్య దర్శిగా తన్నీరు మస్తా నమ్మ, కోశాధికారిగా బొప్పుడి లక్ష్మి.,కమిటీ సభ్యు లతో పాటు 9 మందితో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సంఘానికి గౌరవాధ్యక్షులుగా పేరుబోయిన వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఏసురాజు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయంలో రేపు ఛాయాచిత్ర ప్రదర్శన

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఈ నెల 19 ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాలులో ఛాయా చిత్ర ప్రదర్శన నిర్వ హించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన ఫోటోగ్రఫీ పై ఆసక్తి కలిగిన వారు ఈ ప్రదర్శనలో పాల్గొని తమ ఫోటోలను ప్రదర్శించ వచ్చనన్నారు. ప్రదర్శనలో పాల్గొని గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

చెత్తను తొలగించండి సారూ.. !

ప్రజాశక్తి-కారంపూడి



స్థానిక మాచర్ల రోడ్ లోని డిస్కవరీ స్కూల్ దగ్గర్లో మెయిన్ రోడ్డు ప్రక్కన చెత్త పేరుకు పోతుంది. అక్కడ చెత్తను వేస్తుండటంతో పేరుకుపోతోంది. అక్కడ చెత్త కుండీ లేక పోవడంతో చెత్త మొత్తం రోడ్డున వెళ్లే పాదాచారులపై, దగ్గరలో ఉన్న గృహాల్లోకి ఎగిరిపడుతోందని స్థాని కులు వాపోతున్నారు. పేరుకు పోయిన చెత్తను తీయించమని పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు మొం ˆపెట్టిన ను వారు స్పందించడం లేదని ఎదురు గృహాల వారు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతి అధికారులు స్పందించి రోడ్డు పక్కన పేరుకపోయిన చెత్తను తీయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ వేతన ఒప్పందం నష్టదాయకం

విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ రెండో రోజూ ఆందోళన

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ ఉద్యోగులు, కార్మికులకు నష్టం కలిగించే విధంగా ఉన్న పిఆర్‌సి ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ జిల్లా నాయకులు సిహెచ్.నాగబ్రహ్మాచారి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలో భాగంగా వరుసగా రెండో గురువారం స్థానిక కొత్తపేటలోని డి-3 విద్యుత్ కార్యాలయం వద్ద స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాగబ్రహ్మాచారి మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా విద్యుత్ ఉద్యోగులు, కార్మికులకు నష్టం చేకూర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ యాజమాన్యం, పవర్ జెసితో కుదుర్చుకున్న ఒప్పందం ఇంజినీర్లకు, ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్, పీస్‌రేట్ కార్మికులకు నష్టదాయకమన్నారు. జెఎల్ఎం గ్రేడ్-2లకు ఈ వేతన ఒప్పంద అసలు వర్తింప చేయట్లేదన్నారు. ఎవరికీ ఉపయోగం లేని ఈ వేతన ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2014 వరకూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఒకే





గుంటూరు, పెదకాకానిలో సబ్‌స్టేషన్ల వద్ద నిరసనలో విద్యుత్ కార్మికులు, ఉద్యోగులు

పిఆర్‌సిని పొందిన విద్యుత్ ఉద్యోగులు ఆ తర్వాత జరిగిన రెండు పిఆర్‌సిలలో ఏపీలోని ఉద్యోగులు, కార్మికులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. తెలంగాణ కంటే 30శాతం తక్కువ వేతనాలతో ఏపీ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, జిల్లా కార్యదర్శి జి.నాగరాజు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మిక సంఘాలతో సంబంధం లేకుండా ఏ విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారని ప్రశ్నించారు. 2022 పిఆర్‌సి అమలు చేయమంటే 2018 పిఆర్‌సికి రెండు శాతం కలిపి అమలు చేస్తామనే ఒప్పందం అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల్ని నిలువునా ముంచటమేనన్నారు. పాదయాత్ర సందర్భంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికుల్ని సంస్థలో విలీనం చేసుకొని రూ.43వేల వేతనం ఇస్తుంటే ఇక్కడ మాత్రం రూ.27వేలు ఇస్తున్నారన్నారు. కొత్తగా చేరిన వారికి రూ.13 వేలే ఇస్తున్నారన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, తిరోగమన వేతన ఒప్పందం రద్దు చేసే వరకూ ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు గుంటూరు నగర తూర్పు కమిటీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ నాయకులు జి.పవన్, కె.రాంబాబు, నాగేశ్వరరావు, రాజు, వేణు, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని

స్థానిక పెదకాకాని విద్యుత్ కార్యాలయం వద్ద స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టగా నాగబ్రహ్మాచారి మాట్లాడారు. బాల భాస్కర్, సత్యనారాయణ, బల్లయ్య, జానీ, అనిల్, ఇర్మియ పాల్గొన్నారు.



ఆవిష్కరణలో సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

ప్రజాశక్తి వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజాశక్తి పత్రిక 43వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాశక్తి దినపత్రిక తమ వంతు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో డీఏవో వెంకటస్వామి, ప్రజాశక్తి తెనాలి డివిజన్ ఇన్‌ఛార్జి జి.ప్రభాకరరావు, విలేఖరులు ఎం.రవికుమార్, ఎం.శ్యామ్‌సాగర్ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు, స్థానికులు

ఇళ్లకు పట్టాలివ్వాలని వినతి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి బాపనయ్యనగర్‌లో నివాసం ఉంటున్న ఇళ్లస్థలాలకు పట్టాలివ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో గురువారం తాడేపల్లి తహశీల్దార్ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాయకులు సైకం వెంకటనారాయణ మాట్లాడుతూ గత 50 ఏళ్ల నుంచి తాము ఇక్కడ నివాసం ఉంటున్నామని, అనేకసార్లు ప్రభుత్వ అధికారులకు విజ్ఞప్తులు చేసినా సమస్య పరిష్కారం కాలేదని చెప్పారు. గత పంచాయతీ పాలకవర్గాలు ఈ ప్రాంతంలో రోడ్లు వేయడంతో పాటు తాగునీటి కుళాయిలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించారని చెప్పారు. తమకు ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇస్తే ప్రభుత్వానికి ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారని పేర్కొన్నారు. ప్రభుత్వం పెద్దఎత్తున ఇళ్లస్థలాలు, పట్టాలు ఇస్తున్న నేపథ్యంలో పైసా ఖర్చు లేకుండా ఎప్పటి నుంచో ఉంటున్న తమకు ఉన్న చోటనే పట్టాలు ఇవ్వాలని కోరారు. కె.పెద్దిరాజు, డి.అప్పారావు, వి.అమరయ్య, కె.నాగరాజు, సురేష్ పాల్గొన్నారు.

విద్యా వాలంటీర్లకు వేతనాలు అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక వీవర్స్ కాలనీలోని హైస్కూల్లో విద్యార్థులు సంఖ్య ఎక్కువగా ఉన్నా ఉపాధ్యాయుల కొరత ఉండటంతో ఐదుగురు విద్య వాలంటీర్లను పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో వారికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సహకారంతో రూ.40 వేలను హైస్కూల్ ఆవరణలో వైసిపి నాయకులు గురువారం అందించారు. ఎం.మల్లేశ్వరరావు, ఎమ్‌డి ఫిరోజ్, ఎం.సుధారాణి, ఎస్.సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమస్యలపై మున్సిపల్ కార్మికుల మానవహారం

ప్రజాశక్తి - తెనాలి

కాంట్రాక్టు లేబర్ ఎబాలిషన్ అండ్ రెగ్యులేషన్ చట్టం అమలు చేయాలని ప్రభుత్వాన్ని సిఐటియు జిల్లా నాయకులు కెబాబుప్రసాద్ డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక పురపాలక సంఘ కార్యాలయం వద్ద గురువారం మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనను ఉద్దేశించి బాబుప్రసాద్ మాట్లాడుతూ 1970లో కాంట్రాక్ట్ ఎబాలిషన్ అండ్ రెగ్యులేషన్ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఆ చట్టం ప్రకారం శాశ్వత స్వభావం గల పనుల్లో కాంట్రాక్ట్ కార్మికులను నియమించడం తగదన్నారు. అయితే ఆ విధంగా కాంట్రాక్ట్ కార్మికులతో పనిచేయిస్తే శాశ్వత కార్మికులతో సమానంగా అన్ని బెనిఫిట్స్ వర్తింపచేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతన చట్టం, గ్రాట్యుటి చట్టం, ఫ్యాక్టరీ చట్టం అన్ని వర్తిస్తాయన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు షేక్ హుస్సేన్‌వలి, అధ్యక్షులు ఎం.పద్మ, జయలక్ష్మి, వి.లక్ష్మీనారాయణ, ఆర్.వెంకటేశ్వర్లు, మరియమ్మ, సుజాత, శర్మ పాల్గొన్నారు.



మానవహారంగా ఏర్పడిన కార్మికులు

కెఎల్‌యులో ముగిసిన యువజనోత్సవాలు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో ఈనెల 12వ తేదీ నుండి నిర్వహిస్తున్న అంతర్జాతీయ యువజనోత్సవాలు గురువారం ముగిశాయి. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వీసీ డాక్టర్ జి.పార్థసారదివర్మ మాట్లాడుతూ యువత దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. విజన్, మిషన్ కలిగి కఠోర శ్రమతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. విజయం సాధించాలంటే క్రమశిక్షణ, సానుకూల దక్పథం ముఖ్యమన్నారు. మన దేశంలో 50 శాతానికి పైగా యువత ఉన్నారని, మరే దేశానికి ఇంతటి యువ శక్తి లేదని గుర్తు చేశారు. విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడుతూ మానవ జీవితంలో అత్యున్నతమైనది విద్యార్థి దశన్నారు. దీన్ని సక్రమంగా వినియోగించుకుంటే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని అన్నారు. వర్శిటీ మానసిక నిపుణులు విజయరత్నం మాట్లాడుతూ ప్రతికూల పరిస్థితులు ఎదురయినా, పరాజయాల నుండి పాఠాలు నేర్చుకుని విజయ తీరాలు చేరుకోవాలని సూచించారు.



విజేతలకు బహుతులను అందిస్తున్న అధ్యాపకులు

మహిళా అభివృద్ధి సెల్ అధ్వర్యంలో పోటీలు

కెఎల్ మహిళా అభివృద్ధి సెల్ అధ్వర్యంలో విద్యార్థినులకు '77 ఏళ్ల స్వాతంత్ర్యం తరువాత భారతదేశంలో మహిళల స్థానం ఎక్కడ' అంశంపైన వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు మహిళా సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూత్ రమ్య తెలిపారు. పోటీల్లో 120 మంది పాల్గొనగా యు.హర్షిత, నందినిరెడ్డి మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, కో-కన్వీనర్ డాక్టర్ సోని, కో-ఆర్డినేటర్ కోయా సర్కార్ పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయంలో నోటీసు ఇస్తున్న నాయకులు

25న నిరసనకు వెళ్తున్నట్లు విఆర్ఎల నోటీసు

ప్రజాశక్తి - పెదకాకాని

తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25న విజయవాడలో నిర్వహించే నిరసనకు వెళ్తున్నట్లు విఆర్ఎలు ప్రకటించారు. ఈ మేరకు నోటీసును తహశీల్దార్ కార్యాలయంలో సూరింటెండెండ్‌కు గురువారం అందించారు. ఈ సందర్భంగా విఆర్ఎల సంఘం గౌరవ అధ్యక్షులు ఎన్.శివాజీ, మండల అధ్యక్షులు బి.సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ సహాయకులకు వేతనం పెంచకపోగా డిఎ రికవరీ చేస్తోందని, దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుకూలంగా వేతనాలు పెంచాలని, అర్హులైన విఆర్ఎలను విఆర్ఒలుగా ప్రమోషన్ ఇవ్వాలని, వయస్సు పైబడిన వారిస్థానంలో వారి కుటుంబీకులను నియమించాలని కోరారు. ఈ అంశాలపై జరిగే నిరసనల్లో మండలంలోని విఆర్ఎలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన సిఐ

బుర్రిపాలెం, హాఫ్‌పేటలో 144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి-తెనాలి

ఈనెల 19న ఉప ఎన్నిక జరుగనున్న బుర్రిపాలెం హాఫ్ పేట గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను రూరల్ సిఐ ఎ.శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించారు. సిఐ మాట్లాడుతూ బుర్రిపాలెం సర్పంచ్ స్థానానికి, హాఫ్‌పేట పంచాయతీలోని 3వ వార్డుకు ఉప ఎన్నిక జరుగుతుందన్నారు. ఈ రెండు గ్రామాల్లో తహశీల్దార్ కె.రవిబాబు ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, గ్రామస్తులు నిబంధనలు పాటించాలని కోరారు.



పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్న సిఐ, ఎస్ఐ

హద్దురాళ్ల పనులు త్వరగా పూర్తి చేయాలి

- జెసి శ్యామ్ ప్రసాద్ ఆదేశాలు
- రీసర్వే పనుల పరిశీలన
- నాదెండ్ల పశువైద్య కేంద్రంలో తనిఖీ
- పాడి రైతులతో మాటామంతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మండల పరిధిలోని గోవిందాపురంలో రీ సర్వే పనుల గురువారం నాడు జిల్లా జాయింట్ కలె క్టర్ శ్యామ్ ప్రసాద్ పరిశీలించారు. రీ సర్వే కార్యక్రమంలో భాగంగా భూముల హద్దురాళ్లు నాటే కార్యక్రమం పనులు ఎట్లా జరుగుతున్నాయో పరిశీలించి, సంబంధిత రెవెన్యూ శాఖ అధి కారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఇప్పటి వరకు చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసు కుని, జరుగుతున్న పనులపై పలు సూచనలు చేశారు. త్వ రితగతిన హద్దురాళ్లు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ కార్య క్రమంలో చిలకలూరిపేట తహశీల్దార్ సుజాత, మండల సర్వేయర్, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నాదెండ్ల

జిల్లాలో రీ సర్వే పనులు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. మండలంలో జరుగుతున్న రీ సర్వే పనుల అనంతరం రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, వీఆర్వో నిర్వహిస్తున్న పనులపై జెసి పరిశీలించారు. తుబాడు, ఇర్లపాడు గ్రామాల్లో రెవెన్యూ కేంద్రాల్లో జరుగుతున్న పనులు, రికార్డుల నిర్వహణ, ముటేషన్ పనులు,రీ సర్వే పనులు జరుగుతున్న తీరుపై ఆకస్మిక తనిఖీ చేశారు. విలేజ్ సర్వేయర్లు లాగిన్ లో వస్తున్న సమస్యలు పరిష్కరించేందుకు తీసుకున్న చర్యల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. వీఆర్ఓ లాగిన్ లోకి వచ్చిన రెవెన్యూ అంశాలకు సంబంధించి చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకొని లబ్ధి దారులకు గ్రామ సభలను ఏర్పాటు చేసి రీ సర్వే విధానాల వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు వీఆర్వో లు తదితరులు పాల్గొన్నారు. జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని వేగంగా పాడి రైతులకు చేరవేసి మేలు చేయాలని జెసి ఆదేశించారు. నాదెండ్ల మండల పశువైద్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న పశు



గోవిందాపురంలో రీ సర్వే పనులను పరిశీలిస్తున్న జెసి

వైద్య వైద్య అధికారులు, సిబ్బందితో మాట్లాడి, రికార్డులను పరిశీలించారు. వైద్య సేవలను అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. జగనన్న పాలవెల్లువ కార్యక్రమ పురోగతిని అడిగి తెలుస కొని, కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్లాలని సూచించారు.అందుకు సంబంధించిన పరికరాలు, కేంద్రం నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

రోగులతో మర్యాదపూర్వకంగా మెలగండి

ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

వైద్య సేవలు కోసం ప్రభుత్వ హాస్పిటల్ కు వచ్చే రోగుల పట్ల వైద్య బృందం మర్యాదపూర్వకంగా మెలగాలని మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. పట్టణంలోని పల్నాడు రోడ్డులో గల పాత ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. వైద్య సేవలు అందుతున్న తీరును గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం పాత ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవాలు గర్భిణులకు వైద్య సేవలు సమర్థవంతంగా అందుతున్నాయన్నారు. మాతాశిశు మరణాల నివారణకు వైద్య సిబ్బంది తమ వంతు కృషి చేయాలని సూచించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండాలని



ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పాలని సూచించారు. హాస్పిటల్ కు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పలు అంశాలను ఏరియా హాస్పిటల్ డిసిహెచ్ఎస్ రంగారావు, డాక్టర్ ఓరుగంటి శేషిరెడ్డి, కామిరెడ్డి శ్రీనివాస రెడ్డి, నోడల్ అధికారి హనుమా నాయక్, పలు విభాగాల వైద్యులు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాకవి గద్దర్ సంస్మరణ సభ

ప్రజాశక్తి - వినుకొండ

ప్రజాకవి గద్దర్ సంస్మరణ సభ స్థానిక జాషువా కళా ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. ముందుగా ఆమ్ ఆద్మీ పార్టీ,ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ ఐక్యవేదిక నిర్వాహకులు ఆర్టీసీ డిపో వద్ద నందు ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్తూపం సెంటర్ మీదగా జాషువా కళా ప్రాం గణం వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం జాషువా కళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గద్దర్ సంస్మరణ సభలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

సభాధ్యక్షులు కూకట్లపల్లి పూర్ణచంద్రరావు, ప్రముఖ న్యాయవాది సిహెచ్ఎన్ఎల్ మూర్తి మాట్లాడారు.గద్దర్



మృతిపై పలు అను మానాలు ఉన్నాయని మూర్తి అన్నారు. తక్షణమే ఆయన మృతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.కోటేశ్వరరావు, పి.రాజు, ఎంఐఎం పార్టీ నాయకులు బాజీ, ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రసన్న కుమార్, పి.పౌలేష్, పి.నాగమల్లేశ్వరరావు, సీతయ్య, ఫిరోజ్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో ప్రధాన పార్టీ నుండే పోటీ చేస్తా

చింతలపూడి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల



వచ్చే ఎన్నికల్లో ప్రధాన పార్టీ నుండి గురజాల నియోజకవర్గంలో పోటీ చేస్తానని చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చింతలపూడి శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలోని పల్నాడు ఒయాసిస్ నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి నేటికి పది సంవత్సరాలు పూర్తయిందని ట్రస్ట్ తరపున ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. ఏ పార్టీ నుంచి పోటీ చేస్తాం అనేది త్వరలోనే వెల్లడిస్తామని , గురజాల నియోజకవర్గానికి ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేస్తామని, నాలుగు ప్రత్యేకమైన పథకాలతో ప్రజలను అభివృద్ధి చేస్తామని అన్నారు.

ఉపాధి హామీ గ్రామ సభలు

ప్రజాశక్తి-ఈపూరు

2022- 23 ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సామాజిక తనిఖీ అనంతరం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీవో ఎం.లక్ష్మణరావు గురువారం తెలిపారు. లక్ష్మణరావు మాట్లాడుతూ 18 గ్రామపంచాయతీలలో జరిగిన 515 పనులకు గాను రూ.4,73,80,463 కోట్లు నిధులు ఖర్చవడంతోపాటు పంచాయతీరాజ్ శాఖలో నిర్మాణ పనులకు సంబంధించి రూ.1,12,48,708 కోట్లు నిధులు ఖర్చు చేసినట్లు ఏపీవో తెలిపారు. ఈనెల 17 నుండి 24వ తేదీ వరకు ఆయా గ్రామ పంచాయతీలలో సామాజిక తనిఖీ బృందం గ్రామ సభలు నిర్వహిసుందని, 25న ప్రజా వేదిక నిర్వహిస్తామన్నారు.



బడుగుల అభివృద్ధే అజెండా

మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

ఈ రాష్ట్రంలో బడుగుల అభివృద్ధే తమ పార్టీ అజెండా అని రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గురువారం ఆయన స్థానిక వైసిపి కార్యాలయంలో ఈ నెల 22న నిర్వహించనున్న బిసి గర్జన సన్నా హక సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ ఈ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి బిసి కులానికి చెందిన నిమ్మకాయల రాజ నారాయణకు గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ పదవిని ఇవ్వడంతో పాటు ఈ నియోజకవర్గానికి చెందిన నాగార్జున యాదవ్ కు విద్యా అభివృద్ధి సంక్షేమ చైర్మన్ పదవిని ఇచ్చారని అన్నారు. బిసిలు ఉన్నత పదవులు పొందిన నేపథ్యంలో నియోజకవర్గంలోని బీసీలు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపేందుకు ఈ నెల 22న బిసి గర్జన సభను నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో భవనం రాఘవ రెడ్డి, జడ్పీటిసి సభ్యులు హరీష్ , ఆర్ పురుషోత్తం , పి.సూరిబాబు , కె. వి.భాస్కరరెడ్డి పాల్గొన్నారు .

వాహనచోదకుల ఇక్కట్లు

ప్రజాశక్తి-అమరావతి



పెద్దకూరపాడు నిత్యం రైలు రాకపోకలతో మండల కేంద్రంలో స్టాప్ గేట్ వద్దా గంటల తరబడి వాన చోదకులు ఇబ్బందులకు గురవు తున్నారు. ఫ్లై ఓవర్‌ను ఏర్పాటు చేయాలని సత్తెనపల్లి,అ మరావతి రహ దారులలో ప్రయాణం చేసే ప్రయాణికులు వాహన చోదకులు కోరారు. గతంలో ఫ్లై ఓవర్ నిర్మాణానికి అధికారులు భూమిని పరిశీలించి ప్రణాళికలు సిద్ధం చేశారు.మంజూరు రాగానే నిర్మాణాలు చేపడ తామని చెప్పారు కానీ, ఇంతవరకు పనులు ప్రారంభించ లేదని విమర్శించారు.

తాళ్లూరులో అన్నదానం

ప్రజాశక్తి -పెదకూరపాడు

మండలంలోని తాళ్లూరులో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అయోధ్య స్వామి ఆరాధన మహెూత్సవం ప్రారంభించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చంద్రశేఖర్ స్వామి ప్రారంభించి వడ్డించారు.

ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ ఎల్.శివశంకర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో ఆగస్టు 20 నుండి 26 వరకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీ (అగ్నిపథ్ పథకం) ద్వారా నిరుద్యోగ యువతకు కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీ కార్యక్రమానికి పెద్ద ఎత్తున నిరుద్యోగ యువత తరలివస్తున్న నేపథ్యంలో వారికి అవసరమైన అన్ని వసతి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత కేంద్ర ప్రభుత్వం (అగ్నిపథ్ పథకం) ద్వారా జరుగుతున్న ఉద్యోగ నియామక ప్రక్రియ ను వినియోగం చేసుకోవాలని సూచించారు.

నెలనెలా సాహిత్య మేళ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నెల నెలా సాహిత్య మేళా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19న స్థానిక ప్రకాష్ నగర్ లోని భువనచంద్ర టౌన్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. శనివారం సాయంత్రం 3 గంటల నుండి కవి గురజాడ అప్పారావు రచించిన “సామాజిక సందేశం” అనే అంశంపై, తెలుగు భాషా సాహిత్యాల పై ప్రతి నెల జరుగుతున్న ఈ సాహిత్య విశ్లేషణ కార్యక్రమంలో ప్రజలు పాల్గొనాలని పేర్కొంది.

నామమాత్రంగా ఓటర్ సర్వే : టిడిపి

ప్రజాశక్తి - రెంటచింతల

ఓటర్ల జాబితా సవరణ తూతూ మంత్రంగా సాగుతోందని ఓటర్ల జాబితాలో ఎలాంటి అవకతవకలు జరగకుండా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినప్పటికీ బిఎల్వోలు చాలా వార్డులోనే గృహాలను సందర్శించలేదని టిడిపి మండల అధ్యక్షులు చాపారపు అబ్బిరెడ్డి అన్నారు. ఈ మేరకు తహశీల్దార్ పుల్లారావు కు గురువారం వినతి పత్రం అందజేశారు. ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు జి.సుమంత్‌రెడ్డి, శివయ్య,రాజకుమార్ పాల్గొన్నారు



భారతదేశ అభివృద్ధిలో ఇందిరాగాంధీ పాత్ర మరువలేనిది

పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి - మాచర్ల

భారత రాజ కీయా లలో ఇందిరాగాంధీ పాత్ర ఎంతో ముఖ్య మైం దని అభివృద్ధిలో ఆమె కృషి ఎనలేనిదని పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్దరాజు అన్నారు. మాచర్ల పట్టణంలో స్థానిక బస్టాండ్ సెంటర్లో గురువారం ఇందిరాగాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభకు మాచర్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ యనమల రామచంద్రారెడ్డి అధ్యక్షత వహించారు రుద్రరాజు మాట్లాడుతూ జాతీయ రాజకీయాలు గతానికి ప్రస్తుతానికి చాలా భిన్నంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టే విధంగా పరిపాలన ఉందని విమర్శించారు. కార్యక్రమంలో పిసిసి సీనియర్ కార్యనిర్వాహక అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి పల్నాడు జిల్లా అధ్యక్షుడు అలగ్జాండర్ సుధాకర్, సేవాదళ్ అధ్యక్షుడు ఎలమందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, విద్యుత్ బిల్లులపై సర్పంచుల ఆగ్రహం

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

మండలంలోని రోడ్డులన్నీ అధ్వానంగా ఉన్నాయి.. కనీసం మరమ్మతులైనా చేయండి అని మండలంలోని తిమ్మపురం సర్పంచ్ కల్లూరి శ్రీనివాసరావు మండల పరిషత్ సమావేశంలో కోరారు. ఎంపిపి దాసరి అన్నమ్మ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో అర్ అండ్ బి అధికారి మాట్లాడుతున్న సందర్భంలో సర్పంచ్ శ్రీనివాసరావు కలుగజేసుకున్నారు. మండలంలోని దాదాపు అన్ని రోడ్లు బాగాలేదని, జనం బాగా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. మీరు చేయకుంటే తామే చందాలు అడుక్కుని మరమ్మతులు చేయించుకోవాల్సి వస్తుందని ఆవేదన వెలిబుచ్చారు. తమ గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడంతో పెళ్లికి పిల్లనివ్వడానికీ ఇతరులు వెనకాడుతున్నారని నడిపాలెం-1 ఎంపిటిసి వాసిమళ్ల మాణిక్యరావు అన్నారు. త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని అధికారులు సమాధానమిచ్చారు. నాలుగు నెలల్లో గొట్టిపాడు రోడ్డునూ పూర్తి చేస్తామని, చిన్నకొండ్రుపాడు రోడ్డు కాంట్రాక్టర్‌తో మాట్లాడతామని చెప్పారు.

విద్యుత్ బిల్లుల పేరుతో అదనపు వసూళ్లు

పంచాయతీలోని విద్యుత్ బకాయి పేరుతో డబ్బులు కట్ చేసుకుంటున్నారు.. అసలు పంచాయతీలు ఎంత బకాయి ఉన్నాయి? ఎంత కట్ చేస్తున్నారు? అని ఎంపిడిఒ శ్రీరమ్యను తిమ్మాపురం సర్పంచ్ ప్రశ్నించారు. సమాచార హక్కు చట్టం కింద సమాచారం ఇవ్వాలంటూ లేఖను ఇచ్చి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగైతే తమ పంచాయతీ పరిధిలో ఉంటున్న విద్యుత్ స్తంభాలపై పన్నులు వేయాల్సి ఉంటుందని అసహనం వెలిబుచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్నా సర్పంచ్ శ్రీనివాసరావు



తవ్వి వదిలేశారు..

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్ : పట్టణంలోని 30వ వార్డు బ్రాహ్మణ బజార్లో సైడ్ డ్రెయిన్ల నిర్మాణం కోసం రోడ్డుకిరువైపులా నెల రోజులు క్రితం కాల్వలు తవ్వారు. అయితే పనులు మాత్రం ఇంకా చేపట్టలేదు. దీంతో ఆ ప్రాంతాల్లోని వారు ఇంట్లో నుండి బయటకు వచ్చి వెళ్లడానికి అవస్థ పడుతున్నారు. కాల్వలు రాత్రివేళల్లో సరిగా కనిపించక కొందరు పడిపోతున్నారు. వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. వర్షం వస్తే రోడ్డుపైకి మట్టి చేరి పలువురు జారిపడుతున్నారు. అధికారులు సత్వరమే పనులు పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

తోటమ్మ తల్లి హుండీ ఆదాయం రూ.1.7 లక్షలు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్ : పొన్నూరు పట్టణంలోని తోటమ్మ తల్లి దేవస్థానం హుండీ లెక్కింపు గురువారం దేవస్థానం ఆవరణలో జరిగింది. రూ.1.7 లక్షలు ఆదాయం వచ్చినట్లు బాపట్ల దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్యామల తెలిపారు. మేనేజర్ నాగమల్లేశ్వరరావు, చైర్మన్ జి.వెంకటేశ్వరరావు, అర్చకస్వామి అమర్నాథ్ శర్మ పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు పూర్వ విద్యార్థుల ఆర్థిక ప్రోత్సాహం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన స్థానిక జెడ్‌పి పాఠశాల కారంచేటి లక్ష్మికి రూ.10 వేల ఆర్థిక ప్రోత్సహకాన్ని పాఠశాలలో 1972-73 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థి తేళ్ల శివ నాగేశ్వరరావు గురువారం అందించారు. తన తల్లిదండ్రులైన తేళ్ల పుష్పావతి రామచంద్రయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ మొత్తాన్ని సమకూర్చడంతోపాటు మెరిట్ సర్టిఫికెట్, గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేసి సత్కరించారు. 13 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మరో పూర్వ విద్యార్థి వెల్లకి శివరామ ప్రసాద్ మాట్లాడుతూ వచ్చే ఏడాది రెండు మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకూ నగదుకు ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించారు. కార్యక్రమానికి హెచ్‌ఎం లక్ష్మీ దుర్గ అధ్యక్షత వహించగా జి.అప్పారావు, ఎం.కోటేశ్వరరావు, ఎం.అమ్మయ్య, కె.సాయిప్రసాద, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులు కె.సీతారామయ్య, ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, ఉషారాణి, సురేష్‌కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక ఎస్ఆర్ఎస్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రతిభకు పట్టాభిషేకం పేరున 2022-23 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన బి.అనిత, బి.శ్రీకర్, కె.రాజరాజేశ్వరి, కె.రామ్ తేజను సత్కరించారు. వారికి నగదు ప్రోత్సాహకాలు అందించారు. సంఘం కన్వీనర్ తన్నీరు శివశంకర్ హెచ్‌ఎం షేక్ మౌలాబి, పూర్వ విద్యార్థులు చుక్కా భానుప్రసాద్, కె.శ్రీనివాసరావు, కె.సీతారామయ్య, పి.నరేంద్ర, ఎం.శివభాస్కర్, కె.కె.శ్రీను, పి.మోహనరావు, ఎం.రమణయ్య, ఇఎల్‌వి అప్పారావు, ఎన్ఆర్‌కె శర్మ, చందు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పెదనందిపాడు జెడ్‌పి పాఠశాలలో లక్ష్మికి సాయం అందిస్తున్న శివ నాగేశ్వరరావు, తెనాలిలో విద్యార్థులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం

అందుకే పారిశుధ్యం సరిగా లేదు..

ఏంజెల్ సంస్థపై జిజిహెచ్ సూపరింటెండెంట్ అసహనం

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్య పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనపడుతోందని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేసారు. గురువారం ఆసుపత్రి ఒపి ప్రధాన ద్వారం వద్ద తనిఖీల్లో భాగంగా పారిశుధ్యం సరిగా లేకపోవడన్ని గుర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల పనితీరు సరిగా లేకపోవడం వల్ల పరిస్థితి అధ్వానంగా మారుతోందన్నారు. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న ఏజైల్ సంస్థ పర్యవేక్షణ లోపం ప్రధాన కారణంగా తెలుస్తోందన్నారు. రోజుకు 240 మందిని కార్మికులు విధుల్లో ఉంచాల్సి ఉన్నా 180 మందితోనే పని చేయిస్తున్నారని తెలిపారు. దీనికితోడు ఒక్కొక్కరికి అదనపు డ్యూటీలు విధిస్తున్నారన్నారు. ఈ విషయాన్నీ ఎఫ్ఆర్ఎస్ ద్వారా తెలుసుకున్నామని, పారిశుధ్య, సెక్యూరిటీ కార్మికులకు జీతాలు చెల్లించాల్సిన బాధ్యత ఏజైల్ సంస్థదని అన్నారు. ప్రభుత్వ బడ్జెట్‌తో సంబంధం లేకుండా కార్మికులకు జీతాలు వారే చెల్లించాలన్నారు. గత రెండు మూడు నెలల నుంచి జీతాలు చెల్లించడం లేదని, కార్మికులు తన ఛాంబర్‌కు రావడాన్ని ఆయన తీవ్రంగా పరిగణించారు. జీతాలు రాకపోతే అడగాల్సింది ఏజైల్ సంస్థ యజమానినేన్నారు. ఏజైల్ సంస్థతో సంబంధం లేని వారు ఆసుపత్రిలో అలజడి సృష్టిస్తే సంస్థపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతరహితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్మికులు ఎప్పుడు వస్తున్నారో? విధుల నుంచి దిగిపోతున్నారనే విషయాన్నీ గమనించకుండా ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులు డ్యూటీలో పని చేస్తున్నారా లేదా అనే విషయాలపై రిజిస్టర్ నిర్వహించాలని ఆయన సూచించారు. ప్రతి రోజు వార్డుల్లో తిరిగి స్టాఫ్ నర్సుల ద్వారా పారిశుధ్య సమస్యను గుర్తించి వెంటనే తన దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డిఎస్ఎస్ ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఒ డాక్టర్ సతీష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్‌ల వద్ద పటిష్ట భద్రత : ఎస్పీ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రైల్వేస్టేషన్ వద్ద పూర్తిస్థాయిలో నిఘా, బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ఎస్‌పి ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. గురువారం గుంటూరు రైల్వే స్టేషన్, చుట్టూ ప్రక్కల ప్రాంతాల్లో ఎస్పీ పర్యటించి అక్కడ ప్రజలకు, ప్రయాణికులకు భద్రతా చర్యలపై చర్చించారు. రైలుల్లోను, స్టేషను పరిసరాల్లో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకునే విధంగా, స్థానిక పోలీస్ స్టేషన్ అధికారులు గవర్నమెంట్ రైల్వే పోలీసు (జిఆర్‌పి), రైల్వే పోలీసు ఫోర్సు (ఆర్‌పిఎఫ్) అధికారులు సమన్వయంతో కలిసి పనిచేసి నేరాలు నియంత్రించాలని అన్నారు. గుంటూరు రైల్వే స్టేషను, న్యూ గుంటూరు రైల్వే స్టేషన్, నల్లపాడు రైల్వే స్టేషన్, తెనాలి రైల్వే స్టేషన్ మంగళగిరి రైల్వే స్టేషన్, పొన్నూరు రైల్వే స్టేషన్ మొదలైన ప్రాంతాల్లో ఔటర్లలోను, రైలుల్లోను నేరాల నియంత్రణకు జిల్లా పోలీసుశాఖ ప్రత్యేక కార్యచరణ చేపడుతున్నట్లు తెలిపారు. జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ అధికారులతో కలిసి రైల్వే స్టేషన్లలో, స్టేషను ఔటర్లలోను, రైళ్లలోనూ నేరాలను నియంత్రణకు ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. సంయుక్తంగా ట్రెయిన్ బీట్లు, గస్తీ, ట్రోలింగు ముమ్మరం చేస్తున్నామన్నారు. నేరాల నియంత్రణలో భాగంగా ఆకస్మికంగా ,రైలుల్లోను, స్టేషనుఔటర్లలో అనుమానస్పదంగా సంచరిస్తున్న వారిని అదుపులోకి తీసుకోవడం, విచారణ, వేలి ముద్రలను సేకరించడం, వారి బ్యాగులను తనిఖీ చేయడం, విచారణలో వారు పాత నేరస్థులుగా నిర్ధారణ అయితే వారిపై కేసులు నమోదు చేస్తామని అన్నారు.



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ

సుగాలీపాలెంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - కొల్లిపర : వైఎస్సార్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం తూములూరు సచివాలయం పరిధిలోని సుగాలీపాలెం అంగన్వాడి సెంటర్లో గురువారం నిర్వహించారు. గర్భిణులు, రోగులను మండల వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మిసుధ పరీక్షించి, రక్తపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంగన్వాడి చిన్నారులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు పోషకాహార విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు, ఆరోగ్య శిబిరానికి రాలేనివారికి ఇంటి దగ్గరకు వెళ్లి పరీక్షించి మందులు అందించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది సిహెచ్ భారతి, ఎఎన్ఎం లలితకుమారి, హెల్త్ అసిస్టెంట్ డిఎస్.సుదర్శనశాస్త్రి, ఫార్మసిస్ట్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి

ప్రజాశక్తి-గుంటూరు : రామ్‌కి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ సహకారంతో నిరుద్యోగ యువతకు 60 రోజుల నుండి 90 రోజుల పాటు డిజిటల్ మార్కెటింగ్, జావా, బిపిఒ అంశాలపై ఉచిత శిక్షణ అందించడంతోపాటు ఉపాధి అవకాశాలు చూపిస్తున్నట్లు రామ్‌కి ఫౌండేషన్ అధ్యక్షులు ఎం.వి రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాడికొండ మండలం పెద్దపరిమిలో రామ్‌కి ఫౌండేషన్ శిక్షణ కేంద్రంలో డిజిటల్ మార్కెటింగ్, జావాలో ఉచిత భోజన వసతితో పాటు శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ద్వారా హైదరాబాదు షామీర్‌పేట బిపిఒ శిక్షణ కేంద్రంలో ఉంటుందని, ఈనెల 21న బిపిఒ శిక్షణ హైదరాబాదులో ప్రారంభమవుతుందని, 24వ తేదీ నుండి పెదపరిమిలో డిజిటల్ మార్కెటింగ్ జావా ఫుల్ స్టాక్ కోర్సులు ప్రారంభమవుతాయని తెలిపారు. 20 ఏళ్లు దాటి, ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన యువతీ యువకులు www.ramkeyfoundation.org, www.paravasthu.orgలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 73375 85757, 73375 85959, 900797789, 93912 39935కు సంప్రదించాలని సూచించారు.

కెఎల్‌యులో ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : వాసన్ కంటి ఆసుపత్రి వైద్యుల సహకారంతో కెఎల్‌యు మహిళా అభివృద్ధి సెల్ అధ్వర్యంలో కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలోని ఇండోర్ స్టేడియంలో మూడ్రోజులపాటు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు గురువారం ప్రారంబించారు. వాసన్ కంటి వైద్య నిపుణులు స్నేహ బెనారి మాట్లాడుతూ అన్ని అవయవాల్లో కన్ను ఎంతో ప్రాముఖ్యమైనదని అన్నారు. ట్రాఫిక్, వాహనాల కాంతి లైట్ల వల్ల కళ్లకు హాని అన్నారు. కంప్యూటర్‌తో పనిచేసే వారు కళ్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 150 మంది అధ్యాపకులకు, 50 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లను సిపార్సు చేసి, మందులను ఉచితంగా అందించినట్లు కె.రూత్ రమ్య తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలపై విగ్రహాలకు వినతులు

ప్రజాశక్తి-తెనాలి : జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ నేతల విగ్రహాలకు వినతిపత్రాలు ఇచ్చారు. సర్వమత ప్రార్థన మందిరాల వద్దా విన్నవించారు.

జెడ్పీ సమావేశాలు వాయిదా

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు, జనరల్ బాడీ సమావేశం వాయిదా వేసినట్లు జెడ్పీ సిఇఒ జె.మోహనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం ఈనెల 19న ఉదయం స్టాండింగ్ కమిటీ సమావేశాలు, మధ్యాహ్నం నుండి జనరల్‌బాడీ సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా పరిధిలో కొన్ని గ్రామ పంచాతీల్లో వార్డు మెంబర్లు, సర్పంచ్‌ల ఎన్నికలకు ఈనెల 6న ఎన్నికల కమిషన్ నోటీఫికేషన్ జారీ చేసి దృష్ట్యా ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున జెడ్పీ సమావేశాలు వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు.



వజ్రాల వేటకెళ్తే చట్టపరమైన చర్యలు

పజాశక్తి - బెల్లంకొండ

వజ్రాల కోసం ఎవరైనా వేట సాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అమీర్ తెలిపారు. వజ్రాల వేట నిషిద్ధమని, వెంకటాయపాలెం, కేతవరం అటవీ ప్రాంతంలో వజ్రాల వెతుకులాట కోసం వెళుతున్న వారిని నియంత్రించేందుకు అటవీ శాఖాధికారులతో కలిసి మండలంలోని మన్నేసుల్తాన్‌పాలెం వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేశామని తెలిపారు.

ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు సాదియా

ప్రజాశక్తి-మంగళగిరి



పట్టణానికి చెందిన పవర్ లిఫ్టర్ షేక్ సాదియా ఆల్మాస్ ఈనెల 16వ తేదీ నుండి 22వ తేదీ వరకు షార్జాలో యూఏఈలో జరిగే ఏషియన్ పవర్ లిఫ్టింగ్ యూనివర్సిటీ కప్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఎంపికైనట్లు కోచ్ షేక్ సందాని గురువారం తెలిపారు. సాదియా ఎంపిక కావడంపై ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు అభినందనలు తెలిపారు.

టెన్నిస్‌లో కెఎల్‌యు విద్యార్థికి రజత పతకం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



థాయిలాండ్‌లో జరిగిన ప్రపంచ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో బిటెక్ (ఇసిఇ) మూడో సంవత్సరం విద్యార్థి సూర్య ఆకాష్ పోకల రజత పతకాన్ని సాధించాడు. గతనెల 30న థాయిలాండ్‌లోని పట్టాయాలో ఈ టోర్నమెంట్ జరిగినట్లు కెఎల్‌యు క్రీడల విభాగం అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ తెలిపారు. సూర్య ఆకాష్‌ను వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, వ్యాయామ అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు కొర్రపాడు జెడ్‌పి విద్యార్థులు

ప్రజాశక్తి - మేడికొండూరు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 13న జోనల్ స్థాయి జూనియర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ జరిగింది. ఈ పోటీల్లో మేడికొండూరు మండలం కొర్రపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 9 మంది బాలురు, 8 మంది బాలికలు పాల్గొన్నారు. అన్ని విభాగాల్లోనూ ప్రతిభ చూపిన వీరు టోర్నీ విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ మేరకు క్రీడాకారుల అభినందన సభను పాఠశాలలో గురువారం నిర్వహించారు. హెచ్‌ఎం రమేష్ కుమార్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.



25న తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవం

- **హాజరుకానున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు**
- **జయప్రదం కోసం ప్రచారం**

ప్రజాశక్తి - పెదనందిపాడు

తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రాన్ని 25వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభించనునట్లు సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు తెలిపారు. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ బివి రాఘవులు హాజరవుతారన్నారు. ఈ మేరకు కరపత్రాలను మండల కేంద్రమైన పెదనందిపాడులో గురువారం ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన ప్రచారంలో రామారావు మాట్లాడుతూ పెదనందిపాడు మండలం పాలపర్రులో జన్మించిన నారాయణ అనేక ఉద్యమాలు, పోరాటాలలో పాల్గొన్నారని, ఆయన స్ఫూర్తిని కొనసాగించడానికి విజ్ఞాన కేంద్రాన్ని నిర్మించామని చెప్పారు. పెదనందిపాడు ప్రాంతంలో జాతీయ ఉద్యమంలో పర్వతనేని వీరయ్య చౌదరి నాయకత్వంలో పన్నుల నిరాకరణ ఉద్యమం పెద్ద ఎత్తున జరిగిందని, నల్లమడ రైతుల సమస్యలు, గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగింపు కోసం ఆందోళన ఇప్పటికీ కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో అభ్యుదయ భావజాలాన్ని ప్రచారం చేయడానికి తేళ్ల నారాయణ పేరుతో అనేకమంది దాతల సహకారంతో పెదనందిపాడులోని లావువారివీధిలో విజ్ఞాన కేంద్రాన్ని నిర్మించామని తెలిపారు. విద్యార్థులకు పోటీ పరీక్షల శిక్షణ, మహిళలకు కుట్టు శిక్షణ, ట్యూషన్ పాయింట్ యువకులకు కంప్యూటర్ శిక్షణ, బాలల మనోవికాసానికి వివిధ కార్యక్రమాలు, చర్చగోష్టుల నిర్వహణకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని వివరించారు. ప్రారంభోత్సవానికి ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు, సిపిఎం జిల్లా నాయకులు కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ పెదనందిపాడులో జరిగే అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాటాలకు ఈ విజ్ఞాన కేంద్రం కేంద్ర బిందువుగా ఉంటుందని అన్నారు. ప్రారంభోత్సవానికి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, విజ్ఞాన్ సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, ఇతర ప్రముఖులు హాజరవుతారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి డి.రమేష్ బాబు, నాయకులు కె.శ్రీనివాసరావు, జె.రామారావు, కె.వెంకటశివరావు, కె.వెంకటసుబ్బారావు, కె.శివనాగేశ్వరరావు, సిహెచ్.యానాదులు, ఎం.రమణ, డి.శ్రీనివాసరావు, కె.బాబు పాల్గొన్నారు.



కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తున్న పాశం రామారావు, విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు

చలపతిలో రామ్‌నాథ్ చోప్రా జయంతి

ప్రజాశక్తి-గుంటూరు

ఫాదర్ ఆఫ్ ఇండియన్ ఫార్మకాలజీగా పిలవబడుతున్న భారతీయ ఔషధ నిపుణులు, పరిశోధకులు సర్ రామ్‌నాథ్ చోప్రా జయంతి గురువారం లాంలోని చలపతి ఫార్మసీ కాలేజీలో నిర్వహించారు. రామ్‌నాథ్ చోప్రా వివిధ భారతీయ మొక్కలు, పదార్థాల ఔషధ లక్షణాలపై సమగ్ర సమాచారం అందిస్తూ 'మెటీరియా మెడికా ఆఫ్ ఇండియన్ డ్రగ్స్' అనే పుస్తకాన్ని రచించారని, ఔషధ శాస్త్రవేత్తలు, ఆరోగ్య సంరక్షక అభ్యాసకులకు ఈ పుస్తకం ఒక ముఖ్యమైన వనరుగా మారిందని అన్నారు. పాముకాటుపై చోప్రా చేసిన పరిశోధన, పాము వ్యతిరేక విషాన్ని అభివృద్ధి చేయటానికి సంబంధించిన చికిత్స పద్ధతులను మెరుగుపరచటంలో సర్ రామ్‌నాథ్ చోప్రా కృషి ఎనలేనిదని, దేశంలో లెక్కలేనన్ని ప్రాణాలను రక్షించటంలో కీలకపాత్ర పోషించిందని వివరించారు. ప్రజారోగ్యం, పరిశుభ్రతను చురుగా ప్రోత్సహించే ఆయన ప్రయత్నాలు, వివిధ వ్యాధుల నివారణ, నియంత్రణకు దోహదపడ్డాయని, న్యూఢిల్లీలోని ఆలిండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఫార్మకాలజీ మొదటి ప్రొఫెసర్‌గా పనిచేసి ఆయన అనుభవం ఎంతోమంది విద్యావేత్తల పరిశోధనకు దిక్సూచిలా పనిచేసిందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలోని ఫార్మకాలజీ విభాగం 'యాంటీ మైక్రోబియల్ కీమోథెరపి ఫాస్ట్, కరెంట్ అండ్ ఫ్యూచర్ ట్రెండ్' అంశంపై సర్ రామ్‌నాథ్ చోప్రా స్మారక ఉపన్యాసాన్ని నిర్వహించగా కర్నూలు మెడికల్ కాలేజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.భానుప్రకాష్ మాట్లాడారు. చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు, ఫార్మసీ కాలేజి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు తదితరులు

ఆగస్టు చివరి వారంలో ఇళ్లు ప్రారంభం

- **గృహ నిర్మాణ శాఖ ఎమ్‌డి లక్ష్మీషా**
- **పేరేచర్ల లే అవుట్‌లో పరిశీలన**
- **మౌలిక వసతుల కల్పనకు ఆదేశం**

ప్రజాశక్తి-గుంటూరు

పేదలందరికీ ఇళ్ల పథకం లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు నిర్దేశిత సమయానికి పూర్తయ్యేలా గృహనిర్మాణ శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకొని పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరక్టర్ జి.లక్ష్మీషా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డితో కలిసి ఇళ్ల నిర్మాణాల పురోగతిపై గృహనిర్మాణ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, పంచాయతి రాజ్, డ్వామా, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. లక్ష్మీషా మాట్లాడుతూ ఆగస్టు చివరి వారంలో రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల ఇళ్లను సిఎం ప్రారంభించనున్నారని, గుంటూరు జిల్లాలో 12,500 ఇళ్లు పూర్తి చేయాల్సి ఉందని అన్నారు. ఇప్పటికే జిల్లాలో 12,500 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసినందుకు కలెక్టర్, జిల్లా యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. పేదలందరికీ ఇళ్ల పథకం లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా అధికారులు నిరంతరం సమీక్షించాలని చెప్పారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు ఉపాధి హామీ చట్టం ద్వారా మ్యాజిక్ సోప్ పిట్‌లు, మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, డ్రెయినేజీల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని చెప్పారు. లే అవుట్‌లకు స్వాగత ద్వారాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లే అవుట్‌లకు అప్రోచ్ రోడ్ల ఏర్పాటుకు ఇతర మౌలిక సౌకర్యాల పనులకు క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్రింద నిధులను కేటాయించామని, పనులకు 20 శాతం అడ్వాన్స్‌లు అందిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ళ పథకంలో 67,250 ఇళ్లు జిల్లాకు మంజూరు చేయగా 99 శాతం ఇళ్ల నిర్మాణం ప్రారంభం అయ్యాయన్నారు. 42,451 ఇళ్లు బేస్మెంట్‌పైనా వివిధ దశలలో ఉన్నాయని వివరించారు. నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్లకు విద్యుత్, తాగునీటి సౌకర్యం వెంటనే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బేస్మెంట్ లెవల్‌పైన ఉన్న ఇళ్ళు స్టేజీ కన్వర్షన్‌పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక, నీరు, విద్యుత్‌తో పాటు ఇతర మౌలిక సౌకర్యాలను కల్పించటానికి గృహనిర్మాణ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, యుగంధర్ కుమార్, జెడ్పీ సిఇఒ మోహనరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ సురేష్, హౌసింగ్ ఈఈలు శంకరరావు, భాస్కరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పేరేచర్ల లేఅవుట్‌లో ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్‌డి

పూర్తయిన ఇళ్లకు మౌలిక వసతులు కల్పించాలి

పేదలందరికీ ఇళ్ల పథకం లేఅవుట్‌లలో నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు విద్యుత్, తాగునీటి సౌకర్యం ఇతర మౌలిక సౌకర్యాలు పూర్తి స్థాయిలో కల్పించాలని అధికారులను లక్ష్మీషా ఆదేశించారు. గురువారం మేడికొండూరు మండలం పేరేచర్లలోని లేఅవుట్-3లో ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లు, నిర్మాణం పూర్తయిన 84 ఇళ్లను పరిశీలించారు. ఇళ్లల్లో నివాసం ఉంటున్న లబ్ధిదారులతో మాట్లాడారు. విద్యుత్, తాగునీటి పంపుల ఏర్పాటుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని ఇళ్లకు సోప్ పిట్స్ , మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. రూఫ్ లెవల్ లో ఉన్న ఇళ్లను వెంటనే పూర్తి చేయాలని, బెస్‌మెంట్, ఆ పైన దశలో ఉన్న ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని చెప్పారు. పూర్తయిన ఇళ్లకు బిల్లులు సకాలంలో మంజూరు చేయాలన్నారు. లే అవుట్ స్వాగత ద్వారం పనులు 15 రోజుల్లో పూర్తి చేయాలని, అంతర్గత రహదారులు ఏర్పాటుకు ప్రతిపాదనలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు వేణుగోపాల్, మండల ప్రత్యేక అధికారి, సహకార శాఖ సీఈవో చారి, హౌసింగ్ ఈఈ శంకరరావు పాల్గొన్నారు.